క్లుప్తంగా

రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం తోటవీధిలో జోన్–5 జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ తారా ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో గెడ్డల రక్షణగోడల నిర్మాణానికి శుక్రవారం వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ భూమిపూజ చేశారు. గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్, గోకుల్‌నగర్ వెళ్లే మార్గంలో రక్షణగోడల నిర్మాణానికి సుమారు రూ.18 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఉషారాణి, వర్క్ఇన్‌స్పెక్టర్ గురునాథ్, రాజురెడ్డి, పల్లా ధర్మారావు, బండారు అప్పలరాజు, యలమంచిలి కనకేశ్వరి పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

కంచరపాలెం: స్థానిక దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో శుద్ధ చవితి శుక్రవారం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక దర్శనాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లాత్‌బ్యాగులే వాడుదాం



కొత్తపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు, అధికారులు

గోపాలపట్నం: ప్లాస్టిక్ సంచులు బదులుగా క్లాత్, నార సంచులను వాడుదామంటూ జేడీ ఫౌండేషన్ సభ్యులు 89వవార్డు కొత్తపాలెంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి పురుషోత్తమ రమేష్ పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి అంతా సహకరించాలని కోరారు. కొత్తపాలెం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సైన్యంలో మహిళలకు విశేష అవకాశాలు



ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: భారత సైన్యంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు.కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం సైనిక అధికారులు, విద్యార్థులకు ముఖా ముఖి కార్యక్రమం నిర్వాహించారు. ఆమె మాట్లాడుతూ యుద్ధ సమయంలో వీరోచిత సేవలు అందించిన ప్రముఖులు విద్యార్థినులతో తమ అనుభావాలు పంచుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.లెఫ్టినెంట్ జనరల్ అల్లూరి ఉత్తమ్,జి.ఎం.నాయర్,ఎస్.రవిశంకర్,కల్నల్ వి.సి.భట్,గ్రూప్ కెప్టెన్ కెట్కర్ తదితరులు యుద్ధ సమయాల్లో వారు చూపించిన ధైర్య సాహసాలను విద్యార్థులతో పంచుకున్నారు.

ప్రచారంలోనే.. ప్లాస్టిక్ నిషేధం!



పాలిథిన్..!

పర్యావరణానికి శత్రువు.. ప్రజల ఆరోగ్యానికి చేటు..మూగ జీవాల ప్రాణాలకు ముప్పు.. అని తెలిసినా పాలిథిన్ వినియోగం వదలడం లేదు. అలాంటి ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టాలన్న అధికారుల ప్రయత్నం ప్రకటనలకే పరిమితమవుతోంది. తాజాగా ఈ నెల 1 నుంచి పాలిథిన్ వినియోగంపై జీవీఎంసీ నిషేధం విధించింది. అయినా విక్రయాలు, వినియోగం తగ్గకపోవడంతో ఈ సారైనా పాలిథిన్ నిషేధం సాకారమయ్యేనా అని పర్యావరణ వేత్తలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

- యథేచ్ఛగా పాలిథిన్ వినియోగం
- కఠినంగా వ్యవహరిస్తేనే సంపూర్ణ నిషేధం సాధ్యం
- స్వచ్ఛందంగా చెక్ చెబుదామంటున్న పర్యావరణ ప్రేమికులు



ప్లాస్టిక్ సంచిలో పూలు తీసుకు వెళ్తున్న మహిళ



కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు(పాతచిత్రం)

గోపాలపట్నం: జీవీఎంసీ పరిధిలో గతంలో పలు మార్లు పాలిథిన్ వినియోగాన్ని నిషేధించినా పట్టుమని నెల రోజులు కూడా అమలు కాలేదు. యథేచ్ఛగా వినియోగం జరుగుతోంది. దీంతో ఏ గెడ్డలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మూగ జీవాల మృత్యువాతకు కారణమవుతున్నాయి. అలాంటి తరుణంలో జీవీఎంసీ యంత్రాంగం మరోసారి ఈ నెల 1 నుంచి ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించింది. ఇందుకు గానూ డిసెంబర్ నెలంతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అయినా పాలిథిన్ విక్రయాలు, వినియోగం జోరు కొనసాగుతోంది.

పెరుగుతున్న వ్యర్థాలు

పాలిథిన్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో ప్రతి రోజూ సుమారు మూడు నుంచి నాలుగ టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. 40 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై నిషేధం విధించారు. వాటిని విక్రయించిన వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా కూరగాయలు, మాంసం, హోటళ్లు, బేకరీలు, కర్రీ పాయింట్లు, శుభకార్యాల విందుల్లో పాలిథిన్ వాడకాలు కనిపిస్తున్నాయి. వినియోగించిన తర్వాత ఆ వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో పడేస్తున్నారు. వాటిని పశువులు తినడంతో మృత్యువాత పడుతున్నాయి.

నిబంధనలు తూచ్

గుడి, బడి, బజారు, కిరాణా షాపు, హోటళ్లు, మార్కెట్ ఇలా ఎక్కడికి వెళ్లినా ప్లాస్టిక్ కవర్లే దర్శనం ఇస్తున్నాయి. వ్యాపారులు తమ లావాదేవీల్లో విరివిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు.అధికారుల హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. మరో వైపు కొంత మంది జీవీఎంసీ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి మూలాలపై దృష్టిపెట్టడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు కవర్లతో మిగిలిపోయిన ఆహారాన్ని పడేస్తున్నారు. అవి తినడంతో పశువుల కడుపులోకి ప్లాస్టిక్ వెళ్లడంతో మృత్యువాత పడుతున్నాయి.

విచ్చలవిడిగా అమ్మకాలు

ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచులు, గ్లాసులను మార్కెట్లో విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగంతో ముప్పు ఉందని నిపుణులు, పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నా ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా.. ఇంటికి సరకులు తీసుకురావాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు.



పాలిథిన్ కవర్లలో కూరగాయలు తీసుకెళ్తున్న దృశ్యం

పర్యావరణాన్ని కాపాడుదాం

మనం మారుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో పాలిథిన్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులు వినియోగించాలని సూచిస్తున్నాం. ప్రజలు కూడా మారాలి. మన భవిష్యత్తు తరాలకు ఆస్తులతో పాటు మంచి వాతావరణాన్ని ఆస్తిగా అందిద్దాం. ఇది ఉమ్మడి ఆస్తి. ప్రజలదరిదీ.

– సలాది రామ కృష్ణయ్య, జేడీ ఫౌండేషన్ సభ్యుడు

మనం మారుదాం

- ప్లాస్టిక్ సంచులు బదులు క్లాత్ బ్యాగులు వాడాలి.
- టిఫిన్లు, మాంసం కొనేవారు ఇంటి వద్ద నుంచి తగిన జాగాలు తీసుకు వెళ్లాలి.
- 80 మైక్రాన్లు పైబడి 120 మైక్రాన్లు మందం ఉన్న సంచులనే వాడాలి. వాటిని ఎక్కడపడితే అక్కడ వేయకూడదు.
- జీవీఎంసీ సిబ్బందికి ఇవ్వాలి. వాటిని రీసైకిల్ చేస్తారు.
- చిన్న నిర్లక్ష్యం భవితరాలకు భవిష్యత్తు లేకుండా చేస్తుంది.
- ఈ ప్లాస్టిక్ మహమ్మరి భూమి అంతరించే విధంగా చేస్తుంది.

ఆరోగ్యకర భవిష్యత్తు అందిద్దాం

మన భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు సమష్టి కృషి అవసరం. ప్రభుత్వం, అధికారుల పిలుపును అందిపుచ్చుకుని ఆ మార్గదర్శకాల అమలుకు నాంది పలకాలి. ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా అమలవుతుంది. ముందు ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగానికి చెక్ చెప్పాలి.

–భూషణం మాస్టారు... పర్యావరణ ప్రేమికుడు

విస్తృతంగా అవగాహన

పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధించేందుకు ప్రణాళికాబద్ధంగా నడుస్తున్నాం. వ్యాపారస్తులు 120 మైక్రాన్లకు మించి మందం ఉన్న సంచులనే విక్రయించాలి. లేదా గుడ్డ, నార సంచులు ఇవ్వాలని సూచిస్తున్నాం. నిషేధిత సంచులను సీజ్ చేస్తున్నాం. ఫైన్లు వేయడం వంటివి చేయడం లేదు. స్వచ్ఛందంగా మార్పు రావాలని ఉన్నతాధికారులు సూచించారు. దాన్ని సాకారం చేసే విధంగా కృషి చేస్తున్నాం. నిషేధిత ప్లాస్టిక్ సంచులు కలిగి ఉన్నవారికి నోటీసులు ఇస్తున్నాం. నోటీసులు అందుకున్న వారు తిరిగి వాడినా, అమ్మకాలు సాగించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– అప్పలనాయుడు ఏఎంహెచ్‌వో, జోన్–8

ఆర్టీసీ ఆదాయం పెంచడానికి కృషి

- గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ



400 బస్టాప్ వద్ద ఆటోలు నిలపకుండా పర్యవేక్షిస్తున్న డీఎం ప్రవీణ

మల్కాపురం: ఆర్టీసీ ఆదాయానికి గండి పడకుండా అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నామని గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ సూచించారు. కొంత మంది ఆటో డ్రైవర్లు బస్టాప్‌ల వద్ద ఆటోలు పెట్టి బస్సులు ఆపడానికి ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు అవకాశం లేకుండా పర్యవేక్షణ ఉండాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు బస్టాప్‌లను శుక్రవారం ఆమె స్వయంగా పరిశీలించారు. ఆమెతో పాటు గాజువాక డిపో ఎస్ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంఖరరావు, సూపర్‌వైజర్లు,పలు విభాగా ఉద్యోగులు పలు బస్టాప్‌ల వద్ద నిలబడి ఆటోలు నిలపకుండా చూడడంతో పాటు ప్రయాణికులను దగ్గరుండి ఆర్టీసీ బస్సులు ఎక్కించారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రవీణ మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు, ఉద్యోగులు అంతా కలిసి కట్టుగా ఆర్టీసీ పరిరక్షణ కమిటీగా ఏర్పడ్డామన్నారు. పరిరక్షణ కమిటీ నెలలో వారి వ్యక్తి గత ఆఫ్ సమయాల్లో ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆర్టీసీ ఆదాయం పెంచడానికి వారు తమవంతు సహకారం అందిస్తున్నారని వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యలు పరిష్కరించడంలో కార్యాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. ఏపీ పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలసి శుక్రవారం ఆర్జేడీ విజయ భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో కార్యాలయ ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి సర్వీసు పరమైన సమస్యలైనా, వాటికి తగిన పరిష్కారం చూపేలా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి. ఆనంద్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం. శైలజా కుమారి, కోశాధికారి కృష్ణ చైతన్య, అసిస్టెంట్ డైరక్టర్ బి.వి. నరసింగరావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక వేత్త



సమావేశంలో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్తే కాకుండా పరిపాలనాదక్షుడు అని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక సలహాదారుడిగా ,రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా,ఆర్థిక మంత్రిగా,దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ సమర్థవంతంగా పని చేశారన్నారు. నిజాయితీకి మారు పేరు ఆయన అని కొనియాడారు. ఆర్థికశాస్త్ర అధ్యాపకులు బి.పి.రాజు,ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి వై.అనసూయాదేవి తదితరులు మన్మోహన్‌సింగ్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు వెతలు తీరేదెప్పుడు?

- రోజూ నరకం చూస్తున్నామని వాపోతున్న స్థానికులు



గోపాలపట్నం బంక్ సమీపంలో రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీరు



మురుగు నీటిలో నుంచి వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్న పాదచారు



ఫలితమివ్వని దుకాణ భవన యజమాని ఏర్పాటు చేసిన పైపు

గోపాలపట్నం: తమకు మురుగు నీటి వెతలు తీరేదెప్పుడు అంటూ ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఖజానా జ్యూయలరీ వద్ద నిత్యం మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ దారిగుండా రాకపోకలు సాగించేవారు నరక యాతన పడుతున్నారు. ఉదయం సమయంలో మురుగు నీరు ఎగువ ప్రాంతాల నుంచి వస్తోంది. దీని వల్ల ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఇలా చేయాలి

బీఆర్‌టీఎస్ రహదారి నుంచి వీధి రోడ్డు కలిసే చోట కల్వర్టు నిర్మించాలి. ఖజానా జ్యూయలరీ దుకాణం వద్ద డక్టు పైకప్పులు తెరిచి వ్యర్థాలను తొలగించాలి.

హరిదాసు కుటుంబానికి ఆర్థిక సాయం



హరిదాసు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నివాసి హరిదాసు పేరయ్య కుటుంబానికి ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన హరిదాసు కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి దహన సంస్కారాల కోసం సాయం అందించినట్టు చెప్పారు. ఆ కుటుంబానికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు.

నేడు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సద్గురు షిర్డీసాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వాహించనున్నారు. ఉదయం 6 గంటలకు హారతి ,8 గంటలకు పంచామృతాభిషేకాలు,రుద్రహోమం జరపనున్నారు. సాయంత్రం కాగడ హారతి ,సాయి కీర్తనలు, భజనలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.

12న యూత్ మారథాన్

మురళీనగర్: స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా ఈ నెల 12న మారథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.శ్రీనివాస్ తెలిపారు. ఆ రోజు ఉదయం 5.30గంటలకు 5కె రన్ నిర్వహిస్తామన్నారు. గాజువాక డిపో సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి మల్కాపురం వరకు యూత్ రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https:// youthmarathon2025. fun/ లింక్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

బైక్ ర్యాలీ 6వ తేదీకి మార్పు

ఉక్కునగరం: ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన కలెక్టరేట్ బైక్ ర్యాలీ ఈ నెల 6వ తేదీకి మార్పు చేశారు. 4న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ వస్తున్న నేపథ్యంలో పోలీసులు ర్యాలీకు అనుమతి నిరాకరించారు. దీంతో 4న విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ప్రదర్శనలు , 5న నిర్వాసిత కాలనీల్లో ప్రచారం, 6న కలెక్టరేట్‌కు ర్యాలీ, 7వ తేదీ ఉదయం 8 నుంచి 8వ తేదీ రాత్రి 8 గంటల వరకు నిరాహార దీక్షలు చేయాలని నిర్ణయించినట్టు నాయకులు తెలిపారు.

ఆదర్శప్రాయురాలు సావిత్రిబాయి పూలే



సీఐటీయూ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న యూనియన్ ప్రతినిధులు

మల్కాపురం: సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సేవకురాలే కాదు.. ఆమె మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని ములగాడ తహసీల్దార్ భుజంగరావు అన్నారు. సావిత్రిబాయి పూలే 103 జయంతి సందర్భంగా న్యూ ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలోని సామాజికభవనం వద్ద శుక్రవారం ఆమె జయంతి కార్యక్రమం నిర్వహించారు ఆయన తొలుత సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు నడుపూరి వెంకటరమణ, శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాష్‌రావు, నాయకులు సంపత్‌కుమార్,దాకరపు నూకరాజుయాదవ్,ఎర్రయ్య,ఉరుకూటి శ్రీను,రాజేశ్వరి,ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

- శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకుడు పెద్దిరెడ్ల నానాజీ,పాఠశాల ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి,ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.
- 61వ వార్డు వెంకన్నపాలెం సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులు పెంటారావు,పైడిరాజు తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పించారు.



న్యూ ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ భుజంగరావు తదితరులు

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఆడపిల్లలు చదువుకోవాలని పోరాడిన మహనీయురాలని కొనియాడారు. ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు సావిత్రి బాయి పూలే 194వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ సామాజిక సంస్కరణ ఉద్యమ కార్యకర్తగా, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, కామేశ్వరరావు, ఝాన్సీరాణి, సీతారామ్, రాణి, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న గొల్లమాల అప్పారావు, దళిత నాయకులు

వాసుదేవరావుకు సావిత్రిబాయి పూలే పురస్కారం

మల్కాపురం: అతని సేవలకు గుర్తింపు లభించింది. చేస్తున్న సేవా కార్యక్రమాలకు సావిత్రిబాయి పూలే విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు. పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు రక్తదానం కార్యక్రమాలు నిర్వహించడం.. షార్టు ఫిల్మ్స్ ద్వారా సామాజిక బాధ్యతలపై కథనాలు,చిత్రాలు చేయడం.. నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అందుకు గానూ సావిత్రి బాయి పూలే జయంతిని మరియు అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఐదో మహాసభ పురస్కరించుకుని అవయవ దాతల సంఘం వారు శుక్రవారం గుంటూరు మెడికల్ కళాశాలలో పురస్కారం అందించారు.రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా వాసుదేవరావు పురస్కారం అందుకున్నారు.



శ్రీహరిపురం పాఠశాలలో నివాళులర్పిస్తున్న నానాజీ , విద్యార్థులు

ప్రయాణం ఇలాగేనా?



ఆటోలో వెనుకవైపు కూర్చొని ప్రయాణిస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: విద్యార్థినులు ఆటోలో ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. కొంత మంది కాళ్లు బయటకు పెట్టుకొని కూర్చోగా, మరికొంత మందిని ముందు సీట్లో కూర్చొని డ్రైవర్ బండిని జోరుగా లాగించేస్తున్నాడు. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ఆ దృశ్యాలను చూసిన వారు అంటున్నారు. ఎన్ఏడీ ఏరియాలో శుక్రవారం కనిపించిన దృశ్యమిది. స్కూల్, కాలేజీ విద్యార్థులను ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.